
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



డెంగ్యూతో డిగ్రీ విద్యార్థి మృతి

చిన్నశంకరంపేట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : డెంగ్యూతో చిన్న శంకరంపేట మండలం ఎస్.కొండాపూర్‌లో ఆదివారం డిగ్రీ విద్యార్థి మృతిచెందాడు. గ్రామానికి చెందిన కుమ్మరి శ్యామ్, పుష్ప లత దంపతుల కుమారుడు ప్రభాస్(20) హైదరాబాద్‌లోని కూక ట్‌పల్లిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫైనల్ ఇయర్ చదువుతు న్నాడు. కుటుంబ సభ్యులు మెదక్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా డెంగ్యూగా నిర్ధారణ అయ్యింది. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించగా ఆరోగ్యం క్షీణించి మృతిచెందారు.



ఖాజాపూర్ గ్రామస్థులతో మాట్లాడుతున్న అధికారులు

ఖాజాపూర్‌లో నీటి ఎద్దడి

తీర్చడానికి చర్యలు

ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ షేక్ పాషా, డీఈఈ ఫణివర్మ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కల్హేర్/సిర్గాపూర్. అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): సిర్గాపూర్ మండలం ఖాజాపూర్ గ్రామంలో నెలకొన్న నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటామని సంగారెడ్డి జిల్లా గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూ ఎస్)ఈఈ షేక్ పాషా పేర్కొన్నారు. గ్రామంలో తాగునీటి బోర్లు మరమ్మతులకు గురవడం, మిషన్‌భగీరథ నీరు రాకపోవడంతో ప్రజలు తిప్పలు పడుతున్నారు. ప్రజల అవస్థలపై 'నీటి కోసం కోటి తిప్పలు' అనే శీర్షికతో ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనికి ఉన్నతాధికారులు స్పందించారు. కలెక్టర్ ఆదేశాలతో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ షేక్ పాషా, నారాయ ణఖేడ్ డివిజన్ డీఈఈ ఫణివర్మ, ఏఈ జైపాల్ ఆదివారం ఖాజాపూర్ గ్రామాన్ని సందర్శించి నీటి ఎద్దడికి గల కారణా లను గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఉన్న బోరు బావుల్లోని మోటార్లు చెడిపోయాయని గ్రామస్థులు వివరించారు. పంచాయతీ కార్యదర్శి సకాలంలో స్పందించి మరమ్మతులు చేయకపోవడంతో సమస్య జటిలమయిందని వారు ఈఈకి వివరించారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వెంటనే ఒక బోరులో మోటారును ఏర్పాటుచేసి పరీక్షించారు. మిగిలిన బోర్లనూ వెంటనే వంపిణీ చేస్తామని వెల్లడించారు. అధికారుల స్పందనపై గ్రామస్థులు హర్షం వ్యక్తంచేశారు.

దరఖాస్తులు డల్

మద్యం దుకాణాలపై తర్జనభర్జన



- పది రోజులైనా స్పందన అంతంతే..
- ఉమ్మడి జిల్లాలో 243 వైన్‌షాపులు
- ఇప్పటి వరకు 18 దరఖాస్తులు మాత్రమే
- ఈ నెల 18 వరకు గడువు
- పెరిగిన ఫీజు, పండుగల ప్రభావం..
- ఎన్నికలపై హైకోర్టు తీర్పు కోసం ఎదురుచూపులు

సీజన్‌తో సంబంధం లేకుండా నిత్యం కళకళలాడే వ్యాపారం ఏదైనా ఉందంటే అది మద్యం దుకాణాలే అని వేరే చెప్పక్కర్లేదు. సంతోషం వచ్చినా, బాధ కలిగినా వైన్‌షాపులను ఆశ్రయించడం పరిపాటిగా మారింది. అందుకే సమన్వయంతో నడుపుకుంటే నష్టం లేని వ్యాపారంగా ఇది ముద్రపడింది. ఉచిత దరఖాస్తుల నుంచి రూ.3లక్షల ఫీజు చెల్లించి దరఖాస్తులు సమర్పించే పరిస్థితికి చేరుకున్నది. రెండేళ్ల క్రితం రూ.2లక్షల దరఖాస్తు ఫీజు చెల్లించి పోటీపడగా.. ప్రస్తుతం దరఖాస్తుల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

సంగారెడ్డి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 243 వైన్‌షాపులు ఉండగా సెప్టెం బరు 26వ తేదీ నుంచి కొత్త లైసెన్సుల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఇప్పటి వరకు పది రోజుల్లో కేవలం 18 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ఈ నెల 18వ తేదీతో గడువు ముగియనుంది. డిసెంబరు 1వ తేదీ నుంచి కొత్త షాపులు అమల్లోకి వస్తాయి.

రూ.3లక్షల ఎఫెక్టు

దరఖాస్తు ఫీజు (తిరిగిరాని సొమ్ము) రూ.3లక్షలకు పెంచడంతో ఆశావహులు తర్జనభర్జన పడుతున్నారు. రెండేళ్ల క్రితం రియల్‌ఎస్టేట్ రంగం వృద్ధిలో ఉండడంతో దాదాపు ఆ రంగానికి చెందిన వ్యక్తులే పోటీపడి దరఖా స్తులు సమర్పించారు. ఒక్కో దరఖాస్తుకు రూ.2లక్షల చొప్పున చెల్లించి తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. కాగా ప్రస్తుతం రియల్ ఎస్టేట్ రంగం కుదేలవ్వడంతో మార్కె ట్‌లో డబ్బులకు కొరత ఏర్పడింది. రూ.3 లక్షలు కోల్పోతే జీర్ణించుకోలేమని పలువురు చెప్పుకొస్తున్నారు. అందుకే ఆచితూచి ఆలోచిస్తున్నట్లుగా అర్థమవుతోంది. మద్యం వ్యాపారంపై పూర్తి పట్టు ఉన్నవారితోపాటు దీనిని వృత్తిగా భావించేవారు మాత్రమే రూ.3 లక్షలు చెల్లించడానికి సిద్ధప డుతున్నారు.

హైకోర్టు తీర్పు కోసం ఎదురుచూపులు!

స్థానిక, గ్రామపంచాయతీ ఎన్నికలు జరుగుతాయా.. లేదా అనే విషయం ఈ నెల 8వ తేదీన హైకోర్టు తీర్పుతో తేలబోతోంది. ఒక వేళ ఎన్నికలు ఆలస్యమైతే దరఖాస్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ఎందుకంటే ప్రస్తుతం నడు స్తున్న షాపులు నవంబరు 30వ తేదీ వరకు కొనసాగు తాయి. ఈ సమయంలోనే ఎన్నికల ప్రక్రియ పూర్తవు తుంది. ఎన్నికల్లో మద్యం విక్రయాలు రెట్టింపు సంఖ్యలో ఉంటుంది. ఒకవేళ ఎన్నికలు డిసెంబరు తర్వాత జరిగితే కొత్త షాపులకు దరఖాస్తులు వెల్లువెత్తుతాయి. అందుకే ఇటు పాత,కొత్త మద్యం దుకాణాల ఆశావహులు హైకోర్టు తీర్పు కోసం ఎదురుచూస్తున్నారు.

మద్యం దుకాణాల వివరాలు

జిల్లా	వైన్‌షాపులు	దరఖాస్తులు
సంగారెడ్డి	101	11
సిద్దిపేట	93	01
మెదక్	49	06

సిద్ధమవుతున్న సిండికేట్లు

దరఖాస్తు ఫీజు భారీగా ఉండడంతో గ్రూపుల వారీగా షాపులు దక్కించుకోవడానికి సిద్ధమవుతున్నారు. ఒక బ్యాచ్‌గా ఏర్పాటై పదుల సంఖ్యలో దరఖాస్తులు సమర్పిం చాలని పావులు కదుపుతున్నారు. అవసరమైతే ఒకే దుకా ణానికి ఐదారు దరఖాస్తులు సమర్పించేలా ఎత్తుగడ వేస్తు న్నారు. గతంలోనూ ఇదే పద్ధతిలో దరఖాస్తులు చేశారు. బతుకమ్మ, దసరా పండగల నేపథ్యంలో చాలామంది స్పందించలేదు. మంచి ముహూర్తాలు చూసుకొని రంగం లోకి దిగడానికి సన్నద్ధమవుతున్నారు. కాగా దరఖాస్తుల సంఖ్యను పెంచడానికి ఆబ్కారీ శాఖ యంత్రాంగం కూడా తమవంతు ప్రయత్నాలు చేస్తున్నట్లుగా తెలుస్తోంది.



దహనమవుతున్న రసాయన డ్రమ్ములు

ఔటర్ రింగ్‌రోడ్డు పక్కన కెమికల్ డ్రమ్ములకు నిప్పు

కమ్ముకున్న పొగ

ఉక్కిరిబిక్కిరైన వాహనదారులు

అమీన్‌పూర్, అక్టోబరు 5(ఆంధ్ర జ్యోతి): అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరి ధిలోని కిష్టారెడ్డిపేట ఔటర్ రింగ్ రోడ్డు పక్కన గుర్తుతెలియని వ్యక్తులు కెమికల్ డ్రమ్ములకు నిప్పు పెట్టడంతో రసాయన వాయువులు విస్తరించి ప్రజలు ఉక్కిరిబి క్కిరయ్యారు. ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి 7 గంటల వరకు పెద్ద ఎత్తున మంటలు, రసాయన వ్యాపించడంతో కిష్టారెడ్డిపేట, పటేల్ గూడ, దాయర, ఐలాపూర్, అమీన్‌పూర్, వడక్‌పల్లి తదితర ప్రాంతాల్లోని ప్రజలు ఊపిరి పీల్చుకునేందుకు ఇబ్బం దులుపడ్డారు. రింగ్ రోడ్డుపై ప్రయాణి స్తున్నవారు ఇబ్బందులు పడ్డారు. కెమి కల్ డ్రమ్ములు తెచ్చి ఊరి పక్కన కాల్చుతున్నారని గ్రామస్థులు ఆవదేన వ్యక్తం చేశారు. వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

కాంగ్రెస్ కసరత్తు



- జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థుల ఎంపికకు ముమ్మరంగా సర్వేలు
- ఒక్కో స్థానానికి ముగ్గురి పేర్లతో పీసీసీ అధ్యక్షుడికి జాబితా
- ఎంపీటీసీ అభ్యర్థులపై ఇన్‌చార్జి మంత్రి, ఎమ్మెల్యేదే తుది నిర్ణయం

మెదక్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ నాయకత్వం కస రత్తు ప్రారంభించింది. పార్టీలో అంతర్గత సమీ క్షలు, గణాంకాల సేకరణలో నిమగ్నమైంది. గెలిచే అభ్యర్థులనే ఎంపిక చేసేందుకు వ్యూహా త్మకంగా అడుగులు వేస్తోంది. జిల్లాలోని 21 జడ్పీటీసీ, 190 మండల పరిషత్ స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులను గుర్తించేందుకు రెండు విడ తల్లో సర్వే నిర్వహించింది. ఒక్కో స్థానానికి ముగ్గురి పేర్లతో ప్రాథమిక జాబితాను రూపొం దించారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆది వారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకట స్వామి, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు నేతృత్వంలో జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ ఆశావహుల వివరాలను సీల్డ్‌కవర్‌లో పీసీసీ అధ్యక్షుడికి అందజేశారు. జిల్లా నుంచి అందిన జాబితాలను పరిశీలించి పార్టీ అధిష్ఠానం జడ్పీటీసీ అభ్యర్థులను ఖరారు చేయనుంది. జిల్లా పరిషత్ ఎన్ని కల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో జడ్పీటీసీ స్థానాలకు పార్టీ అభ్యర్థుల ఎంపికపై సీరియస్‌గా దృష్టికేంద్రీకరిస్తు న్నట్లు కాంగ్రెస్ నేతలు తెలిపారు.

ప్రజాభిప్రాయమే ప్రామాణికం

ఎంపీటీసీ అభ్యర్థుల ఎంపిక తుది నిర్ణయం ఇన్‌చార్జి మంత్రి, ఎమ్మెల్యేదేనని తెలు స్తున్నది. కానీ అంతకుముందు మూడు సర్వేలు చేయనున్నారు. మొదటి సర్వేలో బూత్‌స్థాయి నాయకుల అభిప్రాయాలు, గ్రామస్థాయి మద్దతు లెక్కలు సేకరించారు. రెండో దశలో పార్టీ తరఫున నియమించిన సర్వే ఏజెన్సీలు క్షేత్రస్థాయిలో పర్యటించి అభ్యర్థుల ప్రజాదరణ, స్థానిక పరిచయం, పార్టీకి అనుసంధానం, వారి గుణగణాలు, ప్రజల్లో పరపతి తదితర అంశా లను పరిగణనలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. అభ్యర్థుల పేర్లను ఫైనల్ చేసేందుకు మరోసారి సర్వే నిర్వహిస్తామని డీసీసీ అధ్యక్షుడు అంజనే యులుగౌడ్ తెలిపారు. తుది ఎంపిక నిర్ణయం ఎమ్మెల్యేదేనని తెలిపారు.

ఇన్‌చార్జి మంత్రి వివేక్ పర్యవేక్షణ

ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు. సర్వే రిపోర్టులను ఆయన నేతృత్వంలోనే రాష్ట్ర నాయకత్వానికి సమర్పిం చారు. ఆయన పర్యవేక్షణలోనే ఎమ్మెల్యే రోహిత్ రావు అభ్యర్థుల జాబితాను సిద్ధం చేస్తున్నారు. గ్రామస్థాయిలో పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నవారికే ప్రాధాన్యమివ్వనున్నారు. వచ్చే వారం అభ్యర్థులు ఖరారయ్యే అవకాశముంది.

కిటకిటలాడిన ఆలయాలు

ఘనంగా దుర్గాదేవి నిమజ్జనం 4



నాచగిరి క్షేత్రంలో భక్తులు

అదరహో శంకర్

- నాడు ఉద్యమ గాయకుడు..
- నేడు సాంస్కృతి సారథి కళాకారుడు
- ఒక వైపు జానపదం..
- మరోవైపు సినిమా పాటలు
- ఇప్పటి వరకు వేయి పాటలు పాడిన కందుకూరి

5



రాంచందర్‌రావుకు గొంగడి, గొర్రెపిల్లను అందజేస్తున్న కార్యకర్తలు

బీఆర్ఎస్ దోచుకుంది..

కాంగ్రెస్ మోసం చేసింది

- ఏ హక్కుతో ఓట్లడుగుతున్నారు?
- సంగారెడ్డి జడ్పీ పీఠం గెలిచి మోదీకి కానుకగా ఇస్తాం
- 'అలయ్ బలయ్'లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రాంచందర్‌రావు

జోగిపేట రూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : పదేళ్లు పాలించిన బీఆర్ఎస్‌ది దోచుకునే ఎజెండా అయితే.. ఇప్పుడు గద్దెనెక్కిన కాంగ్రెస్‌ది హామీలు ఇచ్చి మోసం చేసే నైజమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు విమర్శించారు. సంగారెడ్డి జిల్లా జోగిపేటలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం మాజీ ఎంపీ బీబీ పాటిల్ ఆధ్వర్యంలో దసరా అలయ్ బలయ్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజ రైన ముందుగా రాష్ట్ర అధ్యక్షుడికి గజమాలతో స్వాగతం పలికారు. సభా ప్రాంగణం వరకు ర్యాలీగా వచ్చిన రాంచందర్‌రావు మాజీ ఎంపీతో జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. అనం తరం కాంగ్రెస్ ముఖ్యనేతలైన చంటి ప్రభు, కుమార్తె చంటి దేవిక బీజేపీలో చేరగా.. వారికి రాంచందర్‌రావు కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ సాధ్యమైనంత దోచుకుందని, ఆ తర్వాత మిగి లిన దాన్ని రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ దోచుకుంటుందని ఆరోపించారు. అమలుకాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. తీరా గెలిచాక వాటిని విస్మరిస్తూ ప్రజలను మోసం చేస్తుందన్నారు.

రైతులను ఆదుకోవాలి

వర్షాకాలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రాష్ట్రవ్యాపంగా పంటలకు తీవ్ర నష్టం వాటిల్లితే ఆదుకోవడం అటుంచితే.. కనీసం పంట నష్టాన్ని కూడా ప్రభుత్వం అంచనా వేయలేకపోయిందంటూ ఎద్దేవా చేశారు. రైతుల పట్ల కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుం దని రాంచందర్‌రావు మండిపడ్డారు. ప్రభుత్వ ఉద్యోగులకు కనీసం జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందన్నారు. గ్రామాల అభివృద్ధి కేవలం బీజేపీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వంతోనే సాధ్యమైందని తెలిపారు. బిల్లులు రాక బీఆర్ఎస్ హయాంలో సర్పంచులు ఆత్మహత్యలు చేసుకున్నారని, కాంగ్రెస్ ప్రభు త్వంలో సైతం అదే జరుగుతుందని చెప్పారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీని గెలి పించి బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని ఆయన కార్యకర్తలకు, నాయకులకు, ప్రజలకు పిలుపునిచ్చారు. సంగారెడ్డి బీజేపీ అభ్యర్థిని జడ్పీ చైర్‌పర్సన్‌గా గెలిపించి మోదీకి కానుకగా ఇస్తామని రాంచందర్‌రావు ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షు రాలు గోదావరి, నాయకులు రాజేశ్వర్‌రావు, దేశ్ పాండే, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో

బీఆర్ఎస్ విజయం ఖాయం

● మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ● బీఆర్ఎస్‌లో పలువురి చేరిక



పార్టీలో చేరినవారికి కండువా కప్పి ఆహ్వానిస్తున్న హరీశ్‌రావు

జహీరాబాద్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉమ్మడి మెదక్ జిల్లావ్యాప్తంగా బీఆర్ఎస్ అభ్య ర్థులే విజయం సాధిస్తారని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలానికి చెందిన వివిధ పార్టీల నాయకులు ఆదివారం హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. హైదరాబాద్‌లోని మాజీ మంత్రి నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉమ్మడి మెదక్ జిల్లాలో స్థానిక ఎన్నికలను బీఆ ర్ఎస్ క్లీన్‌స్వీప్ చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీజేపీలు ప్రజలను మోసం చేస్తున్నాయని ఆరోపించారు. ఆ రెండు పార్టీలు తెలంగాణకు శత్రువులేనని స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయడంలో విఫలమయ్యా రని ఆరోపించారు. ముఖ్యంగ కేంద్రప్రభుత్వం తీసుకువచ్చిన జీఎస్టీతో వస్తువుల ధరలు పెరిగి సామాన్యులపై భారంపడిందని వాపోయారు. తెలంగాణకు కేసీఆర్, బీఆర్ఎస్ శ్రీరామరక్ష అని గుర్తుచేశారు. తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇబ్బందులు పెడుతుందని విచారం వ్యక్తంచేశారు.

హరీశ్‌రావుకు ఘన స్వాగతం

గుమ్మడిదల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ గెలుపు సాధించాలని, ప్రతి గ్రామంలో పార్టీ జెండా ఎగరేయడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరుహరీష్‌రావు పిలుపునిచ్చారు. ఆదివారం మెదక్ పర్యటనలో భాగంగా గుమ్మడిదల గ్రామానికి విచ్చేశారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయ కుడు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో ఆయ నకు ఘనస్వాగతం లభించింది. అనంతరం కార్యకర్తలకు స్థానిక ఎన్నికల్లో గెలుపు కోసం తీసుకోవాల్సిన అంశాలను చర్చించి దిశానిర్దేశం చేశారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ, బీఆర్ఎస్ తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిందని అన్నారు. తమ పాలనలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి సాధించిందని అన్నారు. సంక్షేమ పథకాల ద్వారా ప్రతీ కుటుంబానికి అండగా నిలిచామని గుర్తుచేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు గెలి చేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం కొత్తపల్లి సంతోష్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా హరీశ్‌రావు శుభాకాంక్షలు తెలి పారు. సంకండవా కప్పి ఆశీర్వదించారు. కార్యక్ర మంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



విజంపేటలో పథ సంచలనం చేస్తున్న స్వయం సేవకులు

6

విశ్వగురుస్థానం ఆర్ఎస్ఎస్ లక్ష్యం

జాతీయ సాహిత్య పరిషత్ ప్రాంత ప్రచార కార్యదర్శి భాస్కర యోగి

మురుగు.. మరుగు..!

మురుగు నీటి శుద్ధి ప్లాంట్‌కు బ్రేక్

- జీజీహెచ్‌లో అర్ధాంతరంగా నిలిచిన పనులు
- రెండేళ్ల క్రితం ఒప్పందం
- 12 నెలల్లో పూర్తిచేయాలని టార్గెట్
- గడువు ముగిసినా పూర్తికాని వైనం
- పెద్దాస్పత్రిలో వ్యర్థజలాల నిర్వహణ అస్తవ్యస్తం
- పట్టించుకోని అధికారులు



సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి లోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ప్రాంగణంలో నిర్మిస్తున్న మురుగు నీటి శుద్ధి ప్లాంటు (ఎస్టీపీ-సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్) నిర్మాణానికి బ్రేక్ పడింది. కొన్ని నెలలుగా వీటి నిర్మాణ పనులు ముందుకుసాగడం లేదు. ఫలితంగా పెద్దాస్ప త్రిలో వ్యర్థ జలాల నిర్వహణపై పర్యవేక్షణ కొరవడింది.

రూ.134.46 కోట్లతో ఏర్పాటు

రాష్ట్రంలోని 20 ప్రధాన ప్రభుత్వ ఆస్పత్రుల్లో మురుగు నీటి శుద్ధి కేంద్రాల (ఎస్టీపీ) ఏర్పాటుకు 2022లో గత సర్కారు రూ.134.46 కోట్లు మంజూరుచేస్తూ జీవో జారీ చేసింది. హైబ్రిడ్ యాన్యుటీ మోడ ల్(హెచ్ఏఎం)లో ఏర్పాటు చేయాలని సర్కారు నిర్ణయించింది. అయితే ఒక్కో ప్లాంటు నిర్మాణానికి రూ.2 నుంచి రూ. 6 కోట్ల వరకు సర్కారు కేటాయించినట్లు తెలిసింది. 20 ప్రధాన ఆస్పత్రుల్లో సంగా రెడ్డి జీజీహెచ్ ఆస్పత్రి కూడా ఉంది. అయితే ఎస్టీపీ ప్లాంటు ఏర్పాటుకు 23.1.2023 లో టెండర్ ప్రాతిపదికన ఓ నిర్మాణ సంస్థ ఒప్పందం కుదుర్చుకున్నది. 12 నెలల్లో పనులు పూర్తి చేస్తా మని అగ్రిమెంట్ చేసుకున్నది. అంతే కాకుండా ఈ ప్లాంట్‌ను పదేళ్ల పాటు మెయింటనెన్స్ నిర్వహణకు ఒప్పందం చేసుకు న్నాయి.

గడువు ముగిసినా అసంపూర్తిగానే..

టీజీఎంఎస్ఐడీసీ ఆధ్వర్యంలో మురుగు నీటి శుద్ధి ప్లాంటు నిర్మాణ పనులు చేపడుతున్నారు. వాస్తవానికి 12 నెలల్లో పూర్తి చేస్తామని గుత్తేదారు ఒప్పందం కుదుర్చుకున్నారు. కానీ, గడువులోపు పూర్తికాకపోవడంతో మూడు నెలలు పొడిగించారు. ఈ గడువ ముగిసినా స్పందన లేకపోవడంతో సెప్టెంబర్ వరకు అగ్రిమెంట్ గడువును పొడిగించారు.

ఎస్టీపీ ప్లాంటు ఎందుకంటే..

దవాఖానాల నుంచి వెలువడే వ్యర్థ జలాల నిర్వహణపై గత సర్కారు దృష్టి సారించింది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సివరేజ్ ట్రీట్ మెంట్ ప్లాంట్ (ఎస్టీపీ- వ్యర్థ జలాల శుద్ధి కేంద్రాలు)ల ఏర్పా టుకు చర్యలు చేపట్టింది. వ్యర్థ జలాలను శుద్ధి చేసి బయటకు పంపే క్రమంలో వచ్చే నీటిని మొక్కలకు, క్లీనింగ్‌కు పునర్వినియో గించేలా ఎస్టీపీల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఎస్టీపీల ఏర్పా టుతో దవాఖానాలు పర్యావరణ హితంగా మారుతాయి. ఫలి తంగా పర్యావరణాన్ని, ప్రజారోగ్యాన్ని పరిరక్షిస్తాయి.



నాచగిరి క్షేత్రంలో లక్ష్మీనృసింహస్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు





కొమురవెల్లిలో బోనం తీసుకెళుతున్న కుటుంబం, కొండపోచమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గణేష్

కిటకిటలాడిన ఆలయాలు

వర్గల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రముఖ ఆలయాలు ఆదివారం కిటకిటలాడాయి. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వర్గల్ మండలం నాచారం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజామునే నాచగిరి క్షేత్రానికి చేరుకున్న భక్తులు ఆలయ పుష్కరిణీలో పుణ్యస్నానాలు ఆచారించి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో ఆలయ నిర్వాహకులు భక్తులు క్యూలైన్ల ద్వార స్వామివారి దర్శనం కల్పించారు. క్షేత్రానికి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాటు చేశారు.

మల్లన్న సన్నిధిలో..

కొమురవెల్లి, అక్టోబర్5 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ శైవ క్షేత్రం కొమురవెల్లి మల్లన్న సన్నిధిలో ఆదివారం సెలవు రోజు సందర్భంగా భక్తులు తరలివచ్చారు. గంగిరేణి చెట్టు వద్ద, ఆలయ ముఖమండపంలో పట్నాలు వేసి బోనాలు నివేదించారు. పలువురు భక్తులు ఆలయ ముఖ మండపంలో స్వామివారి నిత్యకల్యాణంలో పాల్గొన్నారు. అనంతరం మల్లన్నను దర్శించుకుని బండారు, పట్టువస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. విజయాచలగుట్టపై ఉన్న ఎల్లమ్మ, పోచమ్మ అమ్మవార్లకు ఒడిబియ్యం పోసి పట్టువస్త్రాలు, బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం బెల్లం, కల్లు సాక సమర్పించారు. సుమారు 20 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయాధికారులు తెలిపారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో టంకశాల వెంకటేష్, ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్, ఏఈవో శ్రీనివాస్, ఇతర సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నిత్యాన్నదాన సత్రానికి రూ.లక్ష విరాళం

ఆలయ నిత్యాన్నదాన సత్రానికి ఆదివారం కరీంనగర్ జిల్లా దుర్శేడ్ గ్రామానికి చెందిన రాపల్లి దివ్యమహేష్ దంపతులు రూ.1,00,116 విరాళం అందజేశారు. ఆలయ కార్యనిర్వహణధికారి టంకశాల వెంకటేష్ వారికి రశీదు అందించగా, అర్చకులు వేద ఆశ్వీరచనం అందించి తీర్థ ప్రసాదాలను అందించారు.

కొండపోచమ్మను దర్శించుకున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే

జగదేవ్‌పూర్: అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) తిగుల్ నర్సాపూర్ సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండపోచమ్మ ఆలయం వద్ద ఆదివారం భక్తుల సందడి నెలకొంది. దసరా సెలవులు ముగుస్తుండటంతో భక్తులు అమ్మవారిని దర్శించుకోవడానికి ఉదయం నుంచి క్యూలైన్‌లో బారులు తీరారు. అమ్మవారికి బోనాలు తీసి ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేష్ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు అనంతరం ఎమ్మెల్యేకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఘనంగా దుర్గాదేవి నిమజ్జనం

సంగారెడ్డి రూరల్/చేగుంట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : దేవీ శరన్నవరాత్రోత్సవాల సందర్భంగా విశేష పూజలందుకున్న అమ్మవారు శనివారం రాత్రి గంగమ్మ ఒడికి చేరారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని శివాజీనగర్, బ్రాహ్మణవాడలో అమ్మవారి విగ్రహాలను ఊరేగింపుగా శోభాయాత్రను నిర్వహించారు. ఈ యాత్రలో భాగంగా కళాకారులు వివిధ దేవతామూర్తుల వేషధారణలో చేసిన నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. అనంతరం పట్టణంలోని మహబూబ్‌సాగర్ చెరువులో అమ్మవారిని నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో రాకేష్‌గౌడ్, దుర్గామాత యూత్ అసోసియేషన్, శౌర్య యువజన సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు. అలాగే చేగుంటలోని హనుమాన్ ఆలయం వద్ద ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత నిమజ్జనం చేశారు.



చేగుంటలో శోభాయాత్రలో నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

సీఎస్ఐ చర్చిలో రెండు గ్రూపుల మధ్య రసాభాస



నచ్చజెప్పుతున్న పోలీసులు

నర్సాపూర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ సీఎస్ఐ చర్చిలో ఆదివారం రెండు గ్రూపుల మధ్య చర్చి కమిటీ ఎన్నిక విషయమై జరిగిన వాగ్వాదం రసాభాసగా మారింది. ఈ మధ్యనే సీఎస్ఐ చర్చి కమిటీ ఎన్నికలు జరగ్గా ఓ ప్యానల్ వారు గెలుపొందగా ఓడిన ప్యానల్ వారు ఎన్నికలు అక్రమంగా నిర్వహించారంటూ ఫ్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. అందులో భాగంగా ఆదివారం రెండు గ్రూపుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుని తీవ్రస్థాయికి చేరింది. పోలీసులు అక్కడికి వెళ్లి రెండు గ్రూపులకు నచ్చజెప్పి పంపించారు.

తాళం ఉన్న ఇంట్లో మంటలు



కాలిపోయిన వంట సామగ్రి

నర్సాపూర్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ పట్టణంలోని సునీతాలక్ష్మారెడ్డి కాలనీలో తాళం వేసిఉన్న ఓ ఇంట్లో అర్ధరాత్రి సమయంలో ఒక్కసారిగా మంటలు రేగి ఇంట్లో సామగ్రి కాలిపోయింది. కాలనీలో నివాసముండే భిక్షపతి కుటుంబం పండుగకు తమ స్వగ్రామానికి వెళ్లారు. అయితే, శనివారం అర్ధరాత్రి సమయంలో ఒక్కసారిగా ఇంట్లో నుంచి మంటలు వస్తుండటంతో సమీపంలోని వారు ఫైర్‌సిబ్బందికి సమాచారమివ్వగా వారు వచ్చి మంటలు ఆర్పారు. బాధితుడు ఆదివారం వచ్చి చూసి ఇంట్లో ఉన్న కొంత నగదు, తులం వరకు బంగారం లేనట్టు గుర్తించడమే కాకుండా మంటలకు వంటసామగ్రి అంతా దెబ్బతిన్నదని వాపోయాడు.

సమస్యల నిలయంగా అమీన్‌పూర్ డబుల్ బెడ్‌రూమ్ కాలనీ

● మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీవాసుల నిరసన

అమీన్‌పూర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : అమీన్‌పూర్ డబుల్ బెడ్ రూమ్ అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లో సమస్యలు తాండవిస్తున్నాయి. సుమారు 1500 కుటుంబాలు నివసిస్తున్న ఈ కాలనీలో సరైన పారిశుధ్య పనులు జరగక దుర్గంధం వ్యాపిస్తోంది. మురుగునీటిని శుద్ధి చేసే ఎస్టీపీ ప్లాంట్‌కు విద్యుత్ కనెక్షన్ కట్ చేయడంతో అదీ పనిచేయడం లేదు. దీంతో వారం రోజులుగా మురుగునీరు శుద్ధి కాక కాలనీవాసులు నరకయాతన అనుభవిస్తున్నారు. డ్రైనేజీలు పొంగిపొర్లడంతో మురుగునీరు సెల్లార్లలోకి చేరి దుర్గంధం, దోమలు వ్యాప్తి చెంది తీవ్ర ఇబ్బందులు సృష్టిస్తున్నాయి. మున్సిపల్ సిబ్బంది ఏటా ఒక్కో ఫ్లాట్ వద్ద పన్నులు వసూలు చేస్తున్నా, కనీస మౌలిక వసతులు కల్పించడంలో నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదంటూ ఆదివారం కాలనీవాసులు అపార్ట్‌మెంట్ల వద్ద నిరసనకు దిగారు. వారికి సీపీఎం నాయకులు మద్దతు తెలిపారు. రెండు రోజుల్లో సమస్యలు పరిష్కరించకపోతే మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు పాండురంగారెడ్డి హెచ్చరించారు.



సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్న కాలనీవాసులు, సీపీఎం నాయకులు



కల్వర్టు దాటేదెట్లా?

● చిన్నపాటి వర్షానికే పైనుంచి నీటి ప్రవాహం

సిద్దిపేట రూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): నిన్న రాత్రి కురిసిన తేలికపాటి వర్షానికే నారాయణరావుపేట మండలం లక్ష్మీదేవిపల్లి, నారాయణరావుపేట గ్రామాల మధ్య ఉన్న కల్వర్టు పై నుంచి వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో వాహనదారులకు, ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. బ్రిడ్జి నిర్మాణ విషయంపై పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోతుందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

జగన్నాథ్‌పూర్‌లో నెలరోజుల్లో 20 పాడిగేదెల మృతి

సకాలంలో వ్యాక్సినేషన్ చేయకపోవడంతోనే



జగన్నాథ్‌పూర్‌లో మృతి చెందిన గేదెలు

నారాయణఖేడ్, అక్టోబరు 5 (ఆంధ్ర జ్యోతి): నెల రోజుల వ్యవధిలో 20 పాడిగేదెలు మృతిచెందాయని మండల పరిధిలోని జగన్నాథ్‌పూర్ గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతీ సంవత్సరం పశువైద్య అధికారులు పాడిగేదెలకు వ్యాక్సినేషన్ చేసేవారని, ఈ సంవత్సరం వ్యాక్సినేషన్ చేయకపోవడంతోనే మృత్యువాత పడ్డాయని పశుపోషకులు ఆరోపించారు.

తమ గ్రామంలో దాదాపు 200 పాడిగేదెలు ఉన్నాయని, నారాయణఖేడ్ పట్టణానికి సమీపంలో తమ గ్రామం ఉండడంతో గేదెలను పెంచుతూ పాలను విక్రయిస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నామన్నారు. ప్రతీ సంవత్సరం పశుసంవర్ధక శాఖ అధికారులు వ్యాక్సినేషన్ చేసేవారని, ఈ మారు వర్షాకాలం ప్రారంభమైన నుంచి వ్యాక్సిన్ చేయలేదన్నారు. కడుపు నొప్పితో పాడిగేదెలు మృతి చెందుతున్నాయని, పశువైద్యాధికారులకు తెలిపిన పట్టించుకోవడం లేదన్నారు. ఒక్కో పాడిగేదె రూ.లక్ష వరకు ఉంటుందన్నారు. ఇప్పటి వరకు ఆదివారం ప్రకాష్, జగన్‌కు చెందిన రెండు పాడిగేదెలు మృతి చెందాయని, నెల రోజులుగా సుభాష్, గైని నర్సయ్య, షాదుల్, రఘునాథ్, రాజుగొండలతో పాటు మరి కొందరి పాడిగేదెలు మృతి చెందాయన్నారు. ఉన్నతాధికారులు స్పందించి పశువుల మృతిపై విచారణ జరిపించి తమను ఆదుకోవాలని గ్రామానికి చెందిన పశు పోషకులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

సిద్దిపేట క్రైం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పట్టణ శివారులోని తమిళనాడు హోటల్ రాజీవ్ రహదారిపై సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి చెందింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజీవ్ రహదారి లింగారెడ్డిపల్లె గ్రామానికి చెందిన సంపంగి మల్లవ్వ(70) ఆదివారం సాయంత్రం రోడ్డు దాటుతుండగా తమిళనాడు హోటల్ వద్ద కరీంనగర్ నుండి హైదరాబాద్ వైపు వేగంగా వెళుతున్న కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న టూ టౌన్ పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహానికి పంచనామ విధించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రి మార్చ్యురీకి తరలించారు. మృతురాలు బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెట్రోల్ పోసి నిప్పంటించిన ముగ్గురు నిందితుల రిమాండ్




నిందితులను చూపుతున్న సీఐ

చేగుంట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): బైక్ దొంగపై పెట్రోల్ పోసి నిప్పంటించిన కేసులో ముగ్గురు నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు రామాయంపేట సీఐ వెంకటరాజాగౌడ్ పేర్కొన్నారు. ఆదివారం చేగుంట పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈనెల 3న చేగుంట మండల పరిధిలోని వడియారం గ్రామంలో చిన్నశంకరంపేట మండలం జంగరాయ్ గ్రామానికి చెందిన బందెల మోహన్ అలియాస్(హేవాన్), ఎర్రోళ్ల మైపాల్ గ్రామంలో అర్ధరాత్రి బైక్ దొంగతనానికి పాల్పడుతూ పట్టుబడ్డారు. వారిని చితకబాదారు. గ్రామంలో దుర్గమాత శోభయాత్రలో ఉన్న దొంతి రమేష్, గుండ్ల రామకృష్ణ, మరికుక్కల అనిల్ అక్కడికి చేరుకుని మోహన్ జేబులో దొరికిన పెట్రోల్‌ను అతడిపైనే పోసి నిప్పంటించారు. మోహన్ ప్రస్తుతం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ కేసులో ముగ్గురు నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్ఐ చైతన్య కుమార్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

ఈత కోసం బావిలో దిగి వ్యక్తి మృతి

మృతదేహం కోసం గాలింపు



మృతదేహం కోసం బావిలో గాలింపు చర్యలు చేపడుతున్న దృశ్యం

కోహీర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో ఈత కోసం బావిలో దిగి వ్యక్తి గల్లంతైన సంఘటన సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని గురుజువాడ గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం జరిగింది. స్థానికుల సమాచారం మేరకు గురుజువాడ గ్రామానికి చెందిన ఆషిక్‌అల్లి(43) మద్యం మత్తులో గ్రామంలోని హనుమాన్ మందిర్ వద్ద గల బావిలో ఈత కోసం దూకాడు. మద్యం మత్తులో ఉండడం వల్ల ఈదేందుకు రాకపోవడంతో నీటిలోనే మునిగిపోయాడు. ఇది గమనించిన స్థానికులు ఈ విషయాన్ని కోహీర్ పోలీసులకు, జహీరాబాద్‌లోని అగ్నిమాపక శాఖ వారికి సమాచారం ఇచ్చారు. దీంతో వారు గ్రామానికి చేరుకొని బావిలో ఆషిక్‌అల్లి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

మనస్తాపంతో వృద్ధుడి ఆత్మహత్య

కొమురవెల్లి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : మనస్తాపంతో వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన కొమురవెల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం.. నాగపురి గ్రామానికి చెందిన దేవనబోయిన రామచంద్రయ్య(70) మద్యం తాగి కుటుంబ సభ్యులను తిడుతుండటంతో ఎందుకు తిడుతున్నవంటూ తన కొడుకు మందలించాడు. మనస్తాపంతో శనివారం ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన చేర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ల సూచన మేరకు పెద్దాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కొమురవెల్లి ఎస్ఐ రాజు గౌడ్ తెలిపారు.

‘ప్రయాస్’ ఫైనల్‌కు ఎంజేపీ గురుకుల విద్యార్థి ఎంపిక



విద్యార్థి సాత్విక్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సృజన

హవేళిఘణపూర్, అక్టోబరు 5 (ఆంధ్యజ్యోతి) : జాతీయ స్థాయిలో అత్యంత ప్రతిష్ఠాత్మక సైన్స్ కార్యక్రమమైన ‘ప్రయాస్ 2025’ ఫైనల్ రౌండ్‌కు హవేళిఘణపూర్ మండల కేంద్రంలోని ఎంజేపీ(బాలుర) గురుకుల పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి సాత్విక్‌నాయక్ ఎంపికయ్యారు. ఎన్‌సీఈఆర్‌టీ-ఢిల్లీ వారి ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఈ పోటీల్లో సాత్విక్ నాయక్ ‘భారతీయ ఆహార విధానం - డయాబెటీస్’ అనే అంశంపై ప్రాజెక్టుతో ఫైనల్‌కు చేరుకున్నారని పాఠశాల ప్రిన్సిపాల్ సృజన తెలిపారు. విద్యార్థి సాత్విక్‌నాయక్‌ను, గైడ్ టీచర్ సాయిబాబను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం అభినందించి, ఫైనల్‌లో విజయం సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

నాణ్యమైన విద్యనందించడమే లక్ష్యం

- ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి రాఘవేందర్‌రెడ్డి



అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంలో రాష్ట్ర, జిల్లా నాయకులు

నారాయణఖేడ్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు నాణ్యమైన విద్యను, తక్కువ ఫీజులతో అందించడమే ప్రైవేటు పాఠశాలల లక్ష్యమని ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ ట్రస్మ రాష్ట్ర కోశాధికారి రాఘవేందర్ రెడ్డి అన్నారు. నారాయణఖేడ్ తాలుకా ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివి ప్రభుత్వ ఉద్యోగాలపై ఆధారపడకుండా, మారుమూల ప్రాంతాల విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దడం కోసం ప్రైవేటు పాఠశాలలను ఏర్పాటుచేసి నాణ్యమైన విద్యనందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారులు రాజశేఖర్, మన్మథకిషోర్, జిల్లా అధ్యక్షులు, జిల్లా సెక్రెటరీ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కోశాధికారి సతీష్ షెట్కార్, జనార్ధన్‌రెడ్డి, ఖేడ్ అధ్యక్షులు ప్రకాష్, ప్రధాన కార్యదర్శి మహాదేవ్, కోశాధికారి ప్రభాకర్, విష్ణువర్ధన్‌రెడ్డి, అంజయ్య, సురేష్‌గౌడ్ పాల్గొన్నారు.

లంబాడీల మహాసమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న గిరిజన సంఘాల నాయకులు

హుస్నాబాద్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్‌లో 8న జరిగే లంబాడీల మహా సమ్మేళనం పోస్టర్‌ను ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఆవిష్కరించారు. ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించాలని సుప్రీంకోర్టులో పిటిషన్ వేసిన నాయకుల విధానానికి వ్యతిరేకంగా ఈ నిర్వహిస్తున్నట్లు గిరిజన సంఘాల నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి లంబాడీలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఇందులో గిరిజన సంఘాల నాయకులు లావుడ్య బిక్షపతి, గుగులోతు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ పండుగ వచ్చిందంటే ఆయన పాడిన ‘చిన్ని మా బతుకమ్మ.. చిన్నారక్క బతుకమ్మ.. దాదీ మా బతుకమ్మ.. దాగెర మొగ్గల బతుకమ్మ’ పాట ఊరూరు, వాడవాడన ధ్వనిస్తుంది. బోనాల పండుగ వేళ ‘డోలు.. డోలు.. డోలు.. డోలమ్మా డోలు’ అనే పాట తెలుగు రాష్ట్రాల్లో ఎంతో ప్రాచుర్యం పొందింది. తెలంగాణ ఉద్యమంలో పాడిన ‘ఉస్మానియా క్యాంపస్‌లో ఉదయించిన కిరణమా’.. ప్రజలను చైతన్యం చేసింది. ఇటీవల పాన్ ఇండియా మూవీ పుష్ప-2 సినిమాలో పాడిన ‘వచుండాయి పీలింగ్స్’ పాట ఆయన పేరు ఎల్లలు దాటడమే కాకుండా ఈ సంవత్సరానికి సైమా అవార్డును తెచ్చిపెట్టింది. ఇలా ఒక వైపు జానపదాలు, మరోవైపు సినిమా పాటలతో అదరగొడుతున్నారు హుస్నాబాద్ పట్టణానికి చెందిన గాయకుడు కందుకూరి శంకర్‌బాబు.

- హుస్నాబాద్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి)

అదరహో శంకర్



- నాడు ఉద్యమ గాయకుడు.. నేడు సాంస్కృతి సారథి కళాకారుడు
- ఒక వైపు జానపదం.. మరోవైపు సినిమా పాటలతో రాణింపు
- ఇప్పటి వరకు వేయి వరకు పాటలు పాడిన కందుకూరి
- పుష్ప-2 సినిమాలోని వచుండాయి పీలింగ్స్ పాటకు సైమా అవార్డు

సైమా అవార్డు తీసుకోవడం మరచిపోలేని అనుభూతి

ప్రముఖ సంగీత దర్శకుడు దేవీశ్రీప్రసాద్ పీఏ మణికందన్ నుంచి హుస్నాబాద్‌లోని డిపో కాలనీలో ఉండే నాకు ఫోన్ వచ్చింది. మీ సాంగ్స్ ఉంటే లిరిక్స్ పెట్టమన్నారు. తదుపరి ఓకే అని ఫ్లయిట్ టికెట్ పంపించి చెన్నై రమ్మన్నారు. పుష్ప-2 లోని చంద్రబోసు రాసిన వచుండాయి పీలింగ్స్ పాటను జానపద గాయని దాస లక్ష్మీతో పాడటానికి దేవీశ్రీప్రసాద్ అవకాశం ఇచ్చారు. ఆ పాట ఈ సంవత్సరం ఉత్తమ గాయకుడిగా సైమా అవార్డును తీసుకొచ్చింది. ఈ అవార్డును సెప్టెంబరు 5వ తేదీన దుబాయ్‌లో తీసుకున్నాను. ఇది నా జీవితంలో మరపురాని ఘట్టం. నాకు అవకాశం ఇచ్చిన దేవీశ్రీప్రసాద్, హీరో అల్లు అర్జున్‌కు ఎప్పటికీ రుణపడి ఉంటాను. అలాగే నా 20 ఏళ్ల కళారంగంలో ఆర్థికంగా లేనప్పటికీ అందరి ఆదరాభిమానాలతో నేను పాడిన పాటలు కళాకారునిగా గుర్తింపు తెచ్చాయి. ఇంకా అందరు ఇచ్చే సహకారాన్ని సద్వినియోగం చేసుకుంటూ మంచి గాయకుడిగా పేరు తెచ్చుకుంటాను.

- కందుకూరి శంకర్‌బాబు



మ్యూజిక్ డైరెక్టర్ దేవీశ్రీప్రసాద్‌తో శంకర్



హీరో అల్లు అర్జున్‌తో కందుకూరి శంకర్

హుస్నాబాద్ పట్టణానికి చెందిన కందుకూరి వెంకటయ్య, ఎల్లవ్వ కుమారుడైన శంకర్‌బాబు పాఠశాల విద్యాభ్యాసం నుంచి సినిమా పాటలు పాడుతూ ఉపాధ్యాయులతో మన్ననలను పొందేవారు. అనంతరం పలు కళాబృందాల్లో పాటలు పాడుతూ గాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. అక్కడి నుంచి జానపద పాటల వైపు అడుగులు పడ్డాయి. జీవనోపాధి కోసం వివిధ సాంస్కృతిక కళాబృందాల్లో ప్రదర్శనలు ఇస్తూ కళాకారునిగా తనకంటూ ప్రత్యేకతను తెచ్చుకున్నారు. తెలంగాణ ఉద్యమ కాలంలో ధూంధాంలో అనేక ప్రదర్శనలు ఇచ్చారు. అప్పుడు తెలంగాణ సభల్లో ఉస్మానియా క్యాంపస్‌లో ఉదయించిన కిరణమా.. అనే పాట సభకు ముందు, సభ తరువాత పాడేది శంకర్. ఆడియో, వీడియో, తెలంగాణ ధూంధాంతో పాటు స్టేజీ ప్రోగ్రాములతో కళారంగంలో 20 ఏళ్లుగా ఉంటూ ఇప్పటి వరకు వెయి వరకు పాటలు పాడారు. యూట్యూబ్ లేని సమయంలో అనేక కళా సంస్థలు విడుదల చేసిన ఆడియోల్లో శంకర్ పాట తప్పక ఉండేది. అనంతరం వీడియోల్లో పాడిన జానపద పాటలు మంచి గుర్తింపు తెచ్చాయి. 2014 తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం కళాకారుడిగా బిజీ అయ్యారు. అనంతరం సాంస్కృతిక సారథి కళాకారుడిగా రాష్ట్రంలో ప్రధాన బృందంలో ప్రదర్శనలు ఇచ్చారు. శంకర్‌కు అల్ల అల్ల నేరేడే ఆల్బమ్ బ్రేక్ ఇచ్చింది.

సామాజిక చైతన్య గేయాలు

జానపదం, సినిమా పాటలే కాకుండా సామాజిక చైతన్య గీతాలను పాడటంలో కూడా శంకర్ దిట్ట. పర్యావరణం, వరకట్నం, భ్రూణ హత్యలు, మన బడి, జలయజ్ఞం, సంక్షేమ పథకాలు పాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు మన్ననలను పొందారు. 2015 సంవత్సరంలో ప్రముఖ చానల్‌లో వచ్చిన చిన్ని మా బతుకమ్మ పాట యూట్యూబ్‌లో 10 కోట్లకుపైగా వ్యూస్, అలాగే 2018లో పాడిన డోలు డోలు బోనాల పాట 20 కోట్లకుపైగా వ్యూస్‌తో దూసుకెళుతుంది. ఇవే కాకుండా అనేక చానల్స్, అనేక ఆల్బమ్‌లల్లో పాటలు పాడారు. హుస్నాబాద్ డిపో వెనుక కాలనీలో ఉంటున్న శంకర్ సాంస్కృతిక సారథి కళాకారునిగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సామాజిక చైతన్య గీతాలపై ప్రదర్శనలు ఇస్తున్నారు. శంకర్ సతీమణి శారద కూడా గాయనియే. ఆమె మూడు ఆల్బమ్‌లల్లో పాడింది.

సినిమాల్లో పాటలు

కందుకూరి శంకర్‌బాబు పలు సినిమాల్లో పాటలు పాడారు.

- సీటీమార్ సినిమాలో ‘ఒయ్ జ్వాలారెడ్డి.. జ్వాలారెడ్డి తెలంగాణ బిడ్డరో కార బూందీ లడ్డురో’
- పుష్ప-2లో ‘వచుండాయి పీలింగ్స్’. ఈ పాటకే సైమా అవార్డు అందుకున్నారు.
- దేవుడు, బల తందానాన, కీడాకోలా, డార్లింగ్ వంటి సినిమాల్లోనూ పాడారు.
- విడుదల కాని మరో మూడు సినిమాల్లోనూ పాటలు పాడారు.

అవార్డులు.. విదేశాల్లో ప్రదర్శనలు

శంకర్ కళాకారుడిగా వివిధ దేశాల్లో ప్రదర్శలు ఇచ్చారు. దుబాయ్, సౌత్ఆఫ్రికా, మస్కట్ వంటి దేశాల్లో ప్రదర్శనలు ఇచ్చి ఈ ప్రాంతానికి గుర్తింపు తెచ్చారు. 2018 సంవత్సరంలో రాష్ట్ర ఉత్తమ గాయకుడి అవార్డు, చిందు ఎల్లమ్మ కళారత్న, తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ అవార్డులు, 2025లో దుబాయ్‌లో పుష్ప-2 సినిమా పీలింగ్స్ పాటకు సైమా అవార్డు అందుకున్నారు. ప్రస్తుత రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ వంటి అనేక మంది ప్రజా ప్రతినిధులు, ప్రముఖులతో అవార్డులు అందుకున్నారు.



భార్య శారదతో శంకర్‌బాబు

అతిపెద్ద మండలానికి తొలి ఎంపీపీగా పని చేశా

- రూ.50 వేల లోపు ఖర్చుతోనే ఎన్నిక
- మనూరు మాజీ ఎంపీపీ శంకరయ్యస్వామి



మాజీ ఎంపీపీ శంకరయ్యస్వామి

నారాయణఖేడ్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద మండలంగా పేరుపొందిన మనూరు మండలానికి తొలి ఎంపీపీ (మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు)గా పనిచేసిన అనుభూతి జీవితంలో మరువలేనిదని మనూరు మాజీ ఎంపీపీ శంకరయ్యస్వామి తెలిపారు. నారాయణఖేడ్ ప్రాంత రాజకీయాలు, వ్యవస్థలో వచ్చిన మార్పులపై ఆయన ‘ఆంధ్రజ్యోతి’తో ప్రత్యేకంగా మాట్లాడారు.

అప్పట్లో ఎంపీపీగా అనుభవం

తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో మండలాలను మొట్టమొదటగా ఏర్పాటు చేసి, ప్రజల నుంచి ఎంపీపీ అధ్యక్షులను నేరుగా ఎన్నుకున్నారు. ఆ సమయంలోనే నేను అధ్యక్షుడిగా ఎన్నికయ్యాను. మనూరు మండలం ఉమ్మడి రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద మండలం. మొత్తం 45 గ్రామాలు, 45 గిరిజన తండాలకు ప్రాతినిధ్యం వహించాం. అంత పెద్ద మండల అధ్యక్షుడిగా పనిచేసిన అనుభూతి ఎప్పటికీ మరువలేం.

అన్ని ప్రభుత్వ శాఖలపై అజమాయిషీ

అప్పటి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు శివరావుషెట్కార్, కిష్టారెడ్డి గారి సహకారంతో నేను ఎంపీపీగా పోటీ చేశాను. ఇంత పెద్ద మండలానికి ఎంపీపీగా ఎన్నిక కావడానికి కేవలం రూ.50 వేల లోపు మాత్రమే ఖర్చు అయింది. మేము ప్రజల నుంచి నేరుగా ఎన్నిక కావడంతో, పోలీసు, రెవెన్యూ శాఖలు తప్ప అన్ని ప్రభుత్వ శాఖలపై ఎంపీపీ అధ్యక్షుడి అజమాయిషీ ఉండేది. దీంతో సంక్షేమ పథకాలను ప్రజలకు స్వతంత్రంగా అందించేవారం. మొదటి మండల అధ్యక్షుడిగా పనిచేసిన అనుభవం చాలా సంతృప్తిని ఇచ్చింది.

కేవలం రూ.5తో సర్పంచ్

- లక్షన్నరతో జడ్పీటీసీగా ఎన్నిక
- తిరుగులేని నాయకుడు మానిక్‌రెడ్డి



మాజీ సర్పంచ్, మాజీ జడ్పీటీసీ మానిక్‌రెడ్డి

కొండాపూర్, అక్టోబర్ 5 (ఆంధ్రజ్యోతి) : రాజకీయాల్లో విలువలు, ఎన్నికల్లో ఖర్చు అనే అంశాలపై చర్చ జరుగుతున్న వేళ, సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన లోకరెడ్డిగారి మానిక్‌రెడ్డి గారి జీవిత ప్రస్థానం నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తోంది. ఆయన కేవలం రూ.5 నామినేషన్ రుసుము చెల్లించి, ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకుండా సర్పంచ్‌గా గెలుపొందారు. ఆయనే 2006లో కాంగ్రెస్ తరఫున జడ్పీటీసీగా గెలిచేందుకు రూ.1.50 లక్షల వరకు ఖర్చు చేయాల్సి వచ్చింది.

28 ఏళ్లు సర్పంచ్‌గా..

మానిక్‌రెడ్డి(82) తన 26 ఏళ్ల వయస్సులో సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేయడానికి అప్పట్లో నిర్ణయించారు. నామినేషన్ రుసుముకే భయపడే ఆ రోజుల్లో, కేవలం ఐదు రూపాయల రుసుముతో గెలిచి, 28 సంవత్సరాల పాటు (ఆరు పర్యాయాలు) తిరుగులేని నేతగా కొనసాగారు. తన పదవీ కాలంలో ఆయన ఎప్పుడూ పైసా ఆశించకుండా, గ్రామ ప్రజల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేశారు. దివంగత మాజీ ఎమ్మెల్యే పి.రామచంద్రారెడ్డి సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేశారు. ఇళ్లు లేని నిరుపేదలకు పట్టాభూమిని కొనుగోలు చేసి 110 ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇచ్చారు. జీతగాళ్లుగా ఉన్న, గుంట భూమి కూడా లేని 20 మంది లబ్ధిదారులకు 20 ఎకరాల సాగు భూమిని పట్టా చేసి పంపిణీ చేశారు.

జడ్పీటీసీగా గెలుపు, ఖర్చు పెరుగుదల

రాష్ట్ర, జిల్లా స్థాయి కాంగ్రెస్ నాయకులతో మంచి సంబంధాలు, తాను చేసిన సంక్షేమ పనుల కారణంగా ప్రజల్లో మానిక్‌రెడ్డికి ప్రత్యేక గుర్తింపు లభించింది. ఇదే అండతో ఆయన 2006లో కాంగ్రెస్ పార్టీ తరఫున జడ్పీటీసీగా కొండాపూర్ స్థానం నుంచి పోటీ చేసి గెలుపొందారు. ఈ ఎన్నికల్లో గెలుపు కోసం ఆయన రూ.1.50 లక్షలు ఖర్చు చేయాల్సి వచ్చింది.

నేటి రాజకీయ ముఖచిత్రంపై ఆవేదన

అప్పటి ఎన్నికలకు, నేటి ఎన్నికల వాతావరణానికి ఉన్న తేడాపై మానిక్‌రెడ్డి గారు ఆవేదన వ్యక్తం చేశారు. ‘నాటి ఎన్నికల్లో రూపాయి ఖర్చు లేకుండా కేవలం మానవత్వాన్ని, మంచి పనులను చూసి ఓటు వేశారు. కానీ, నేటి ఎన్నికల్లో మంచి వ్యక్తిని గుర్తించడం కష్టంగా మారింది. సత్తా ఉన్న నాయకుడని చూడకుండా, ఓటును డబ్బుతో కొనుగోలు చేయగలిగే స్థోమత ఉన్న అభ్యర్థులనే వెతుకుతున్నారు. వార్డు సభ్యుల ఎన్నికకు సైతం ఓటుకు డబ్బు ఇచ్చే పరిస్థితికి వచ్చింది’ అని ఆయన విచారం వ్యక్తం చేశారు. సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థులు లక్షల నుంచి కోట్లు ఖర్చు చేసి గెలుపొందాల్సిన దుస్థితి కనిపిస్తోందని మానిక్‌రెడ్డి అన్నారు. అనుభవం ఉన్న వ్యక్తుల కంటే, రాజకీయాల్లోకి రావడానికి డబ్బున్న వ్యక్తులు ఆశపడుతున్నారు. పదవులకు ఖర్చు చేసిన డబ్బును తిరిగి ఎలా సంపాదించాలనే వ్యాపార ధోరణి నేటి నాయకుల్లో కనిపిస్తోందని, మనిషిపై మనిషికి నమ్మకం లేక, డబ్బుకు ఓట్లే పరమార్థంగా పార్టీలు, నాయకులు దిగజారుతున్నారని ఆయన అభిప్రాయపడ్డారు.

జిన్నారం మండలంలో ‘స్థానిక’ ఎన్నికలకు గుడ్‌బై

- జిల్లా అంతటా ఎన్నికల కోలాహలం
- మూడు మున్సిపాలిటీల ఏర్పాటుతో మండలంలో నిశ్శబ్దం



జిన్నారం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలవడంతో సంగారెడ్డి జిల్లా అంతటా ఎన్నికల సందడి నెలకొంది. అయితే, హైదరాబాద్‌కు శివారు ప్రాంతమైన జిన్నారం మండలంలో మాత్రం ఎన్నికల వాతావరణం కనిపించక నిశ్శబ్దం అలుముకుంది. మండలంలోని అన్ని గ్రామాలు మూడు మున్సిపాలిటీల్లో విలీనం కావడంతో, స్థానిక సంస్థల ఎన్నికలకు ఈ ప్రాంతం పూర్తిగా దూరం కావడమే దీనికి కారణం. స్థానిక సంస్థల ఎన్నికల అవకాశం లేకపోవడంతో, ఎంపీపీ, జడ్పీటీసీ, సర్పంచ్, ఎంపీటీసీ, వార్డు సభ్యుల వంటి కీలక పదవులపై ఆశలు పెట్టుకున్న నాయకుల్లో, ఓటర్లలో తీవ్ర నిరాశ నెలకొంది.

జిన్నారం మొత్తం మున్సిపల్ పాలన కిందకు..

పటాన్‌చెరు నియోజకవర్గంలో పారిశ్రామిక ప్రాంతంగా ఉన్న జిన్నారం మండలం ఇప్పుడు పూర్తిగా పురపాలక పాలన కిందకు చేరింది. గతంలో 2020లో బొల్లారం మున్సిపాలిటీ ఏర్పాటు కాగా, దీని పాలకవర్గం గడువు 2025 జనవరిలో ముగిసింది. ప్రస్తుతం మరో రెండు కొత్త మున్సిపాలిటీలు ఏర్పాటయ్యాయి. గడ్డపోతారం మున్సిపాలిటీని ఐదు గ్రామ పంచాయతీలతో, జిన్నారం కేంద్రంగా మరొక మున్సిపాలిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మండలం పూర్తిగా ఈ మూడు మున్సిపాలిటీలుగా ఏర్పాటు కావడంతో, మండల పరిషత్ పాలన (ఎంపీపీ, జడ్పీటీసీ) ఇక ముగిసినట్టే. సర్పంచ్ ఎన్నికలకు అవకాశం లేకుండా పోయింది. ఈ నిర్ణయం తమ వాదనలు వినకుండానే ఏకపక్షంగా జరిగిందని పలువురు నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మున్సిపల్ ఎన్నికల కోసం నిరీక్షణ

స్థానిక సంస్థల ఎన్నికలకు అవకాశం లేకపోవడంతో, నాయకుల దృష్టి ఇప్పుడు పురపాలక ఎన్నికలపై పడింది. అయితే, గత జనవరిలోనే బొల్లారం మున్సిపాలిటీ పాలకవర్గం పదవీకాలం ముగిసినా, కొత్తగా ఏర్పాటైన మున్సిపాలిటీలకు సంబంధించిన విషయంపైనా ఇంతవరకు ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయలేదు. దీంతో తమ ప్రాంతంలో మున్సిపల్ ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయో అనే నిరీక్షణ ఆశావహులలో నెలకొంది.



దూప్‌సింగ్ తండాకు నిలిచిన రాకపోకలు

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా హవేళిఘణపూర్ మండలంలోని గంగమ్మ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీని కారణంగా దూప్‌సింగ్ తండాకు వెళ్లే రోడ్డుపైనుంచి వాగు నీరు ప్రవహించడంతో తండాకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో తండా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ దారిపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను త్వరగా పూర్తి చేసి తమ బాధలు తీర్చాలని తండా ప్రజలు అధికారులను కోరుతున్నారు.

- హవేళిఘణపూర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి)

నర్సాపూర్ మార్గంలో రోడ్డంతా గుంతలే

తూప్రాన్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణ పరిధిలోని రోడ్లు పూర్తిగా గుంతలమయంగా మారాయి. చౌటుప్పల్ నుంచి సంగారెడ్డి వరకు వెళ్లే జాతీయ రహదారి 161ఏఏ (నేషనల్ హైవే) తూప్రాన్ మీదుగా నర్సాపూర్‌కు వెళుతుంది. గతంలో ఈ 161ఏఏ రోడ్డును రీజనల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్)గా మార్చాలని భావించినప్పటికీ, ఆర్ఆర్ఆర్‌ను వేరే చోట నిర్మిస్తుండటంతో, ఈ రోడ్డును పీపీపీ (పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్) పద్ధతిలో నిర్మించాలని నిర్ణయించారు. అయితే, 161ఏఏ హైవేగా ప్రకటించినప్పటికీ, అధికారులు మరమ్మతు చర్యలు చేపట్టడం లేదు. తూప్రాన్ నుంచి నర్సాపూర్ మార్గంలో గుంతలు ఏర్పడటంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా గీతా స్కూల్ వద్ద, బ్రాహ్మణపల్లి రైల్వే లెవెల్ క్రాసింగ్ వద్ద రోడ్డంతా గుంతలు పడ్డాయి. ఈ దారిలో ప్రయాణించే వాహనదారులు నడుము నొప్పులు వస్తున్నాయని వాపోతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.





బ్రాహ్మణపల్లి రైల్వే స్టేషన్ వద్ద గుంతలమయం, గీతా స్కూల్ వద్ద స్పీడ్ బ్రేకర్లు, గుంతలు



చిన్నచెల్మెడ- పెద్దచెల్మెడ రోడ్డుపై తెగిపోయిన కల్వర్టు



ఆరేళ్ల క్రితం శంకుస్థాపన చేసిన శిలాఫలకం

శిలాఫలకానికి ఆరేళ్లు..!

- అయినా పూర్తికాని పెద్ద, చిన్నచెల్మెడ రోడ్డు పనులు
- మట్టిరోడ్డుతో రైతులు, ప్రజల అవస్థలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

మునిపల్లి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : మట్టి రోడ్డును బీటీగా మరుస్తామని బీఆర్ఎస్ ప్రభుత్వం శంకుస్థాపన చేసినా.. నేటికీ పనులు పూర్తికాలేదు. దీంతో ఆ రోడ్డు మట్టి రోడ్డుగానే దర్శనమిస్తోంది. వర్షాకాలం వస్తే ఆయా గ్రామాల రైతులు తమ వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లేందుకు నరకయాతన అనుభవిస్తున్నారు. మండలంలోని పెద్దచెల్మెడ నుంచి చిన్నచెల్మెడ గ్రామం వరకు ఉన్న మట్టి రోడ్డును బీటీగా నిర్మిస్తామని 2017-18 సీఆర్ఆర్ (రూ.1.80 కోట్ల) నిధులతో అప్పటి ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ 18 ఫిబ్రవరి 2019లో పనులకు శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు పనులు మాత్రం పూర్తికాలేదు. దీంతో అటు పెద్దచెల్మెడ రైతులు, ఇటు చిన్నచెల్మెడ రైతులు వారి పొలాలకు వెళ్లేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యమో.. పాలకుల అలసత్వమో కానీ శిలాఫలకమేసి ఆరేళ్లవుతున్నా పనులు కాకపోవడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వర్షాకాలం వచ్చిందంటే కష్టాలే..

ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా చిన్నచెల్మెడ-పెద్దచెల్మెడ రోడ్డుపై చిన్నచెల్మెడ గ్రామ సమీపంలో ఉన్న కల్వర్టు తెగిపోయింది. దీంతో కనీసం ఎద్దుల బండ్లు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొన్నది. వానాకాలం వచ్చిందంటే తమకు కష్టాలు వచ్చినట్టేనని రైతులు వాపోతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మారి రెండేళ్లు కావస్తున్నా- ఈ రోడ్డు వైపు అధికారులు కానీ, పాలకులు కన్నెత్తి చూడడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పెద్దచెల్మెడ- చిన్నచెల్మెడ రోడ్డు పనులు షురూ చేసి మట్టి రోడ్డును బీటీరోడ్డు వేయాలని ఆయా గ్రామాల రైతులు, ప్రయాణికులు కోరుతున్నారు.



పెద్దచెల్మెడ, చిన్నచెల్మెడ మట్టి రోడ్డు

న్యూస్ బాక్స్

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి దరఖాస్తులు చేసుకోండి

సంగారెడ్డి రూరల్ అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మెదక్ జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు ఆధార్‌కార్డు, ఓటర్ ఐడీ కార్డుతో దరఖాస్తు చేసుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ సెంట్రల్ జోన్ కమిటీ సభ్యుడు రాజేశ్వర్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. తమ పార్టీ అభ్యర్థులే కాకుండా వివిధ పార్టీల నాయకులు టికెట్లు రాని వారు ఉంటే వారు తమ పార్టీకి దరఖాస్తు చేసుకోవాలని పిలుపునిచ్చారు. పూర్తి వివరాలకు 9000738683 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

నేడు దసరా అలయ్, బలయ్

- హాజరుకానున్న మాజీమంత్రి, మాజీ ఎమ్మెల్యేలు

రేగోడు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : దసరా అలయ్, బలయ్ కార్యక్రమాన్ని సోమవారం పట్‌పల్లి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బుచ్చయ్య, ప్రధాన కార్యదర్శి సుంకే రమేష్ తెలిపారు. అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి హరీశ్‌రావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చంటి రాహుల్ కిరణ్ తదితరులు వస్తున్నారని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వీవోఏ కుటుంబానికి ఆర్థిక సహాయం

కల్హేర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : గుండెపోటుతో మరణించిన సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండల పరిధిలోని మునిగేపల్లి గ్రామానికి చెందిన ఐకేపీ వీవోఏ న్యాలకంటి కిషన్ కుటుంబానికి కల్హేర్ ఐకేపీ సిబ్బంది ఆదివారం ఆర్థిక సహాయం అందజేశారు. కల్హేర్ ఐకేపీలో వీవోగా విధులు నిర్వహిస్తున్న కిషన్ గుండె పోటుతో శుక్రవారం మరణించిన విషయం విదితమే. ఆయన కుటుంబానికి ఆసరాగా కల్హేర్ ఐకేపీ ఏపీఎం వంశీక్రిష్ణ, సీసీలు, వీవోఏలు కలిసి కిషన్ భార్యకు రూ.25 వేయిల ఆర్థిక సహాయం అందజేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మునిపల్లి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పెద్దగోపులారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జానిమియా కుమారుడు ఖాజా అనారోగ్యంతో ఆదివారం మృతిచెందాడు. అంత్యక్రియల నిమిత్తం దామోదర రాజనర్సింహ ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ నాయకురాలు త్రిష దామోదర్ తనవంతుగా అందజేసిన రూ.15 వేల నగదును మాజీ ఎంపీటీసీ బుర్కల పాండు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బుర్కల రాజు అందజేశారు. ఈ సందర్భంగా త్రిష దామోదర్‌కు బాధిత కుటుంబసభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

మున్నూరుకాపు నూతన కార్యవర్గం ఎన్నిక



మున్నూరుకాపు సంఘం కార్యవర్గం

మెదక్ అర్బన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మున్నూరుకాపు సంఘం పిట్లంబేస్ శాఖ నూతన కార్యవర్గాన్ని ఆదివారం సంఘ భవనంలో సంఘ రాష్ట్ర బాధ్యులు బట్టి జగపతి, బండనారాయణ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా సంగాయిపేట నర్సింలు, ఉపాధ్యక్షుడిగా సిద్దయ్య, సురేష్, కిషన్, రాజు, కోశాధికారిగా భిక్షపతి, కార్యదర్శులుగా తిరుపతి, నర్సింలతోపాటు పలువురు ఎన్నికయ్యారు.

మాజీ సర్పంచ్‌కు పరామర్శ

గజ్వేల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని మల్లన్నసాగర్ ముంపు గ్రామమైన లక్ష్మాపూర్ మాజీ సర్పంచ్ కొలిచెల్మె స్వామి తండ్రి మృతిచెందిన విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి పరామర్శించారు.

నూతన కమిటీ ఎన్నిక

దౌల్తాబాద్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): అఖిలరాజ్ ఫౌండేషన్ సేవా సంస్థ నూతన కమిటీని ఎనుకున్నారు. ఆ సంస్థ మండల అధ్యక్షుడిగా మండల పరిధిలోని ముబారస్‌పూర్ గ్రామానికి చెందిన కోరె శేఖర్‌ను ఎన్నుకున్నట్లు దుబ్బాక నియోజకవర్గ బాధ్యుడు బిట్ల భాస్కర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా ఉపాధ్యక్షులుగా అంతొల్ల అంజి(దొమ్మాట), చింతకింది రాజు (మల్లేశంపల్లి), కార్యదర్శులుగా కర్ణాకర్ (ముబారస్ పూర్), బొల్లం రాజేష్ (సూరంపల్లి) తదితరులు ఎంపికయ్యారు.

పార్టీ నిర్ణయాలకు కట్టుబడి పనిచేద్దాం

- మాజీ మంత్రి డా.చంద్రశేఖర్, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి



మొగుడంపల్లిలో నిర్వహించిన సమావేశంలో చంద్రశేఖర్, గిరిధర్‌రెడ్డి

జహీరాబాద్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : పార్టీ నిర్ణయాలకు కట్టుబడి పనిచేద్దామని మాజీ మంత్రి డా.చంద్రశేఖర్, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు సిద్ధం ఉజ్వల్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రమైన మొగుడంపల్లిలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిగతా సమయాల్లో నాయకులందరూ వేర్వేరుగా ఉన్నా ఎన్నికల సమయంలో మాత్రం సంఘటితమై అభ్యర్థులను గెలిపించుకుందామన్నారు. ఆశావాహులు నిరుత్సాహానికి గురికావద్దని, అధిష్టానం నిర్ణయించిన అభ్యర్థుల గెలుపు కోసం పనిచేద్దామని చెప్పారు. రాష్ట్రంలో మనమే అధికారంలో ఉన్నందున క్షేత్రస్థాయిలో ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, సర్పంచ్ అభ్యర్థులను గెలిపించుకుంటే ముందు మరిన్ని అభివృద్ధి పనులు జరుగుతాయనే విషయాన్ని అందరు నాయకులు, కార్యకర్తలు గమనించాలన్నారు. క్షేత్రస్థాయిలో ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఇదిలా ఉండగా ప్రతీ మండలం నుంచి జడ్పీటీసీ అభ్యర్థులకు సంబంధించి మూడు పేర్లను అధిష్టానానికి పంపిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ టీఎస్ఐడీసీ చైర్మన్ మహ్మద్ తన్వీర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మక్సూద్, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

హరీశ్‌రావును కలిసిన అశోక్‌గౌడ్



హరీశ్‌రావుతో అశోక్‌గౌడ్

నర్సాపూర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ డి.అశోక్‌గౌడ్ ఆదివారం మాజీ మంత్రి హరీశ్‌రావును హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తాజా రాజకీయ పరిస్థితులు, పరిణామాల గురించి హరీశ్‌రావు ఆరాతీసినట్లు అశోక్‌గౌడ్ తెలిపారు.

నేడు లింగాయత్‌ల ఆత్మీయ సమ్మేళనం



సంగారెడ్డిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న వీరశైవ లింగాయత్ బలిజ జిల్లా అధ్యక్షుడు పృథ్వీరాజ్

సంగారెడ్డి రూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం ఆధ్వర్యంలో సోమవారం సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లిలోని విద్యానగర్ కమ్యునిటీహాల్‌లో దసరా పండుగ సందర్భంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు పృథ్వీరాజ్ తెలిపారు. సంగారెడ్డిలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆత్మీయ సమ్మేళనానికి లింగాయత్ బంధు మిత్రులందరు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం గౌరవ అధ్యక్షుడు ధనంజయ, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్ పాటిల్, ఉపాధ్యక్షుడు రాజేశ్వర స్వామి, ఉప కోశాధికారి శివకుమార్, కార్యదర్శులు బసవేశ్వర్, శివకుమార్, గౌరీశ్వర్, మహిళా కమిటి ఉపాధ్యక్షురాలు వీరమనమ్మ, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

నీట్ విజేతలకు ఘన సన్మానం



సంగారెడ్డిలో నీట్‌లో విజయం సాధించిన విద్యార్థులను సన్మానించిన బీసీ సంక్షేమ సంఘం నాయకులు

సంగారెడ్డి రూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : నీట్ ప్రవేశ పరీక్షలో విజయం సాధించిన విద్యార్థులను ఆదివారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ప్రభుగౌడ్ మాట్లాడుతూ వైద్యులకు సమాజంలో చాలా మంచిపేరు ఉన్నదని, ఆ పేరును నిలబెట్టుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డా. మల్లికార్జున్, సంఘం ప్రధాన కార్యదర్శి కృష్ణ, జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ స్వామి, సలహాదారుడు చంద్రయ్య స్వామి, మహిళా విభాగం అధ్యక్షురాలు మంజులగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

డీవైఎస్‌వో వెంకట నర్సయ్యకు సన్మానం



డీవైఎస్‌వోను సన్మానిస్తున్న తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ సభ్యులు

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి జంగపల్లి వెంకట నర్సయ్యను ఆదివారం హైదరాబాదులోని ఒలింపిక్ భవన్‌లో తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్, రాష్ట్ర సైక్లింగ్ అసోసియేషన్లు ఘనంగా సన్మానించాయి. సైక్లింగ్ అసోసియేషన్‌లో సుదీర్ఘ కాలం పాటు సేవలు అందించి ఎంతోమందిని జాతీయస్థాయిలో ప్రాతినిధ్యం వహించేలా కృషిచేశారని కొనియాడారు. ప్రస్తుతం సిద్దిపేట జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారిగా సేవలందిస్తున్న సందర్భంగా అభినందనలు తెలిపి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఒలింపిక్ అసోసియేషన్, సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి, అంతర్జాతీయ సైక్లింగ్ క్రీడాకారుడు మాక్స్‌వెల్ ట్రావర్, తెలంగాణ సైక్లింగ్ సంఘం ప్రధాన కార్యదర్శి భూలోకం విజయ కాంతారావు, ఉపాధ్యక్షుడు బండారుపల్లి శ్రీనివాసులు, స్పోర్ట్స్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్ చంద్రారెడ్డి, రైల్వే కోచ్ దిలీప్ అత్తర్, రాష్ట్రంలోని వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ అవార్డుల ప్రదానం

చేర్యాల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్, పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో పాటు ఇటీవల నూతనంగా ఉద్యోగాలు పొందిన పలువురు యువతీ, యువకులను మున్నూరుకాపు సంఘం చేర్యాల పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా స్థానిక సంఘం భవనంలో మాజీ ఎంపీపీ, సంఘం పట్టణాధ్యక్షుడు మేడిశెట్టి శ్రీధర్ వారికి ప్రశంసాపత్రం అందించి శాలువా కప్పి సన్మానించారు. విద్యార్థులు మరింత కష్టపడి ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత స్థానానికి చేరుకోవాలని కోరారు. ఉద్యోగాలు పొందిన యువతీ, యువకులు అంకితభావంతో పని చేస్తూ ప్రజలకు సేవలందించి మన్ననలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు వెలుగల రాజు, కోశాధికారి దాసరి సమ్మయ్య పాల్గొన్నారు.

విశ్వగురుస్థానం ఆర్ఎస్ఎస్ లక్ష్యం

- జాతీయ సాహిత్య పరిషత్ ప్రాంత ప్రచార కార్యదర్శి భాస్కర యోగి



సంగారెడ్డిలో మాట్లాడుతున్న జాతీయ సాహిత్య పరిషత్ ప్రాంత ప్రచార కార్యదర్శి భాస్కర యోగి

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : స్వాభిమానం, స్వయం సమృద్ధి విశ్వగురుస్థానం ఆర్ఎస్ఎస్ లక్ష్యమని జాతీయ సాహిత్య పరిషత్ ప్రాంత ప్రచార కార్యదర్శి భాస్కర యోగి అన్నారు. సంగారెడ్డిలోని భవానీ మందిర్ వద్ద రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) శతాబ్ది ఉత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. అనంతరం పట్టణంలోని శ్రీనగర్, కిందిబజార్, శివాజీనగర్, అంబేద్కర్ స్టేడియం, భవానీనగర్, నేతాజీనగర్, బసవేశ్వరనగర్, మాధవనగర్, పాతబస్టాండ్, దిడ్డిగౌని మీదుగా పథసంచలన్ నిర్వహించారు.

●గుమ్మడిదల: గుమ్మడిదలలో ప్రాథమిక ఉన్నత పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించిన ఆర్ఎస్ఎస్ శతాబ్ది విజయోత్సవంలో తెలంగాణ ప్రాంత భౌతిక ప్రముఖ్ కూర జగదేకరావ్ పాల్గొని మాట్లాడారు.

●పెద్దశంకరంపేట: పెద్దశంకరంపేటలో స్వయం సేవకులు ఆదివారం రామాలయం నుంచి భవానీమాత కమాన్, పాత బస్టాండ్, కొత్త బస్టాండ్, గాంధీ చౌరస్తా, గడికోట మార్కండేయ మందిర్ మీదుగా రామాలయం వరకు చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ బాధ్యులు పాల్గొన్నారు.

●పాపన్నపేట: ఆర్ఎస్ఎస్ సేవకులుగా దేశ సేవలో తరిద్దామని ఆర్ఎస్ఎస్ జిల్లా విభాగ్ కార్యదర్శి భూషణం పిలుపునిచ్చారు. ఆదివారం పాపన్నపేటలో పథ సంచలన్ కార్యక్రమం నిర్వహించారు.

●నిజాంపేట: వ్యక్తి నిర్మాణం కోసమే ఆర్ఎస్ఎస్ 100 ఏళ్లుగా ప్రయత్నిస్తుందని వక్త మాననీయ ఇప్ప భానుచందర్ అన్నారు. ఆదివారం నిజాంపేటలో ఆర్ఎస్ఎస్, నిజాంపేట ఉప మండల ఆధ్వర్యంలో పథ సంచలన్ నిర్వహించారు. ముందుగా ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకులతో పాటు భరతమాత చిత్రపటాలకు పూలమాలవేశారు.

●జిన్నారం: జిన్నారంలో హిందూ జాగరణ సమితి ఆధ్వర్యంలో ఆర్ఎస్ఎస్ శత జయంతి సందర్భంగా ప్రధాన వీధుల్లో సంచాలన్ ర్యాలీ నిర్వహించారు.



గుమ్మడిదలలో రూట్ మార్చ్ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ సేవకులు

●పుల్‌కల్: మండల కేంద్రమైన చౌటకూర్‌లో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు ఆదివారం ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆవిర్భవించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా పెద్దఎత్తున కవాతు నిర్వహించారు.

●మెదక్ అర్బన్ : భారతదేశపు ప్రాచీన సంస్కృతీ సంప్రదాయాలను నిలబెట్టాలని ఆర్ఎస్ఎస్ డా. భాను పిలుపునిచ్చారు. మెదక్ జిల్లా కేంద్రంలో ఆదివారం ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలను నిర్వహించారు.

●రామాయంపేట: ప్రతి ఒక్కరిలో దేశభక్తి ఇమిడి ఉండాలని సినీనటుడు ఐరేని మురళీధర్‌గౌడ్ అన్నారు. రామాయంపేట పట్టణంలో ఆదివారం సాయంత్రం ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు వైభవంగా సాగాయి. తదుపరి ఓ ప్రైవేట్ స్కూల్లో ఏర్పాటు అయిన సభలో మురళీధర్‌గౌడ్ మాట్లాడారు.

అపరిశుభ్రంగా మంచినీటి ట్యాంకులు

- రోగాల బారిన ప్రజలు
- శుభ్రం చేయించాలని గ్రామస్థుల వేడుకోలు



మల్‌చెల్మ గ్రామంలో పాకురుతో ఉన్న మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంకు

జహీరాబాద్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల సౌకర్యార్థం నీటి సరఫరా జరిగే మినీ ట్యాంకులు, ఓవర్ హెడ్ ట్యాంకులు అపరిశుభ్రంగా ఉండడంతో ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారు. నెల రోజులకోసారైనా మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయడం లేదంటే పల్లెల్లో పాలన ఏవిధంగా ఉందో అవగతమవుతున్నది. జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల్లో కొన్ని గ్రామాలు మినహా ఎక్కువశాతం గ్రామాల్లో మంచినీటి ట్యాంకులు అపరిశుభ్రంగా మారాయి. మల్‌చెల్మ గ్రామంలో ఓవర్‌హెడ్ ట్యాంకు అంతా పాకురు పట్టి ఉన్నది. అధికారులు స్పందించి ట్యాంకులను శుభ్రం చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పేరుకుపోయిన చెత్తాచెదారం



చిన్నశంకరంపేట గాంధీ కాలనీలో పేరుకుపోయిన చెత్త

చిన్నశంకరంపేట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని గాంధీ కాలనీ మెదక్-చేగుంట రహదారి పక్కన చెత్తాచెదారం పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. ఈ చెత్తలో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. అంతేకాకుండా దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. వర్షం పడితే చెత్త అంతా చెల్లాచెదురు అయ్యి వాసన భరించలేకపోతున్నామని ప్రజలు వాపోతున్నారు. పంచాయతీ ఈవో స్పందించి, వెంటనే చెత్తను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ఖేడ్‌లో మోస్తరు వర్షం

నారాయణఖేడ్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడన ద్రోణి ప్రభావంతో ఆదివారం ఉదయం నారాయణఖేడ్‌లో ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. ఇటీవలి వరకు భారీ వర్షాలు కురియడంతో చేతికందే దశలో ఉన్న పత్తి, సోయా, జొన్న, వరి, తదితర పంటలకు నష్టం వాటిల్లింది. ఐదురోజులుగా వర్షం లేకపోవడంతో ఇప్పుడిప్పుడే పొలాల్లో తడి ఆరుతుంది. ఈ క్రమంలో ఆదివారం వర్షం కురియడంతో పంట పొలాల్లో వర్షం నీరు చేరిందన్నారు.

గ్రామం సుభిక్షంగా ఉండాలని యజ్ఞం



మాయికోడ్‌లో యజ్ఞం నిర్వహిస్తున్న దృశ్యం

మనూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : మనూరు మండలంలోని మాయికోడ్ గ్రామంలో వివేకానంద సేవాసమితి ఆధ్వర్యంలో దంపతులచే యజ్ఞం నిర్వహించారు. ప్రతినెల మొదటి ఆదివారాన్ని పురస్కరించుకొని గ్రామానికి చెందిన బస్వరాజ్ దంపతులచే యజ్ఞం నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, వివేకానంద సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

నేడు అయ్యప్పస్వాముల మహా పాదయాత్ర



సాహితిరాము, గురుస్వామి

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి పాత బస్టాండ్ సమీపంలోని నవరత్న ఆలయం నుంచి శబరిమల అయ్యప్పస్వామిని దర్శించుకోవడానికి మహాపాదయాత్ర సోమవారం ప్రారంభం కానున్నది. 30 మంది అయ్యప్పస్వాములతో మూడోసారి పాదయాత్ర చేపట్టనున్నామని గురుస్వామి సాహితి రాము తెలిపారు. సుమారు 1600 కిలోమీటర్లు పాదయాత్ర కొనసాగనున్నదని పేర్కొన్నారు. శంకర్‌పల్లి మీదుగా తిరుపతి చేరుకొని వేంకటేశ్వరుని దర్శనం చేసుకుని అక్కడి నుంచి కాణిపాకం సిద్ధి వినాయకుడి దర్శనం, అక్కడి నుంచి అరుణాచలం గిరి ప్రదర్శన చేసుకుని శబరిమల కొండకు పయనమవుతామని నిర్వాహకుడు, గురుస్వామి సాహితి రాము తెలిపారు.

స్థానిక సమరంలో విజయపంథా ఎగురవేద్దాం

- బీజేపీ రాష్ట్ర నేత రాగి రాములు



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న రాములు

రామాయంపేట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సమరంలో విజయపంథా ఎగురవేద్దామని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాగి రాములు పిలుపునిచ్చారు. ఆదివారం బీజేపీ మండల కార్యకర్తల సమావేశం రామాయంపేటలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరికొద్ది రోజుల్లోనే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నేపథ్యంలో ప్రజల ఆదరాభిమానాలు చూరగొనాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నవీన్‌గౌడ్, శంకర్‌గౌడ్, సుధాకర్‌రెడ్డి, బాలరాజ్, దయానందరెడ్డి పాల్గొన్నారు.